క్లుప్తంగా

గ్యాస్‌స్టౌ మరమ్మతు సెంటర్లు ఇవే!

సాక్షి, అమరావతి: వరద బాధితు సహాయార్థం ముంపు ప్రాంతాల్లో ఉచితంగా గ్యాస్ స్టౌ రిపేరు, సిలిండర్ల సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 ఉచిత సర్వీస్ సెంటర్లలో నీటిలో మునిగిపోయిన స్టౌలను మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. స్పేర్ పార్ట్స్ అవసరమైతే తక్కువ ధరకే అందించడానికి గ్యాస్ కంపెనీలు అంగీకరించాయని తెలిపారు.

ఉచిత గ్యాస్ స్టౌ సర్వీసు సెంటర్లు ఇవే

- వార్డు సెక్రటేరియట్ నంబర్ 42,
- షాదీఖానా గుప్తా సెంటర్, కుమ్మరిపాలెం
- ఈద్గా మహల్, చిట్టినగర్
- ఆర్‌సీఎం స్కూల్
- ఎంఎల్‌ఎస్ పాయింట్,గొల్లపూడి
- గోకరాజు గంగరాజు స్కూల్
- ఎస్సీ కమ్యూనిటీ హాల్, మొగల్రాజపురం
- ఏపీఎస్‌ఆర్‌ఎంసీ స్కూల్
- రవీంద్ర భారతి స్కూల్, సత్యనారాయణ పురం
- కేబీఎన్ కాలేజీ, వన్‌టౌన్

వినాయక విగ్రహాలు సిద్ధం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి సమీపించడంతో అయోధ్యనగర్ సీకే రెడ్డి రోడ్డులో వినాయక విగ్రహాలను విక్రయాలకు సిద్ధం చేశారు. ఇక్కడ అడుగు నుంచి 8 అడుగుల వరకు విగ్రహాలను అందుబాటులో ఉంచారు. రూ.2 వేల నుంచి రూ.20 వేల వరకు సైజు, మోడల్‌ను బట్టి విక్రయించనున్నట్లు వ్యాపారులు తెలిపారు. వరదలు, వర్షాల నేపథ్యంలో ఇప్పటివరకు విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను సైతం ఇక్కడ విక్రయిస్తున్నారు.

శత సహస్ర మోదక లక్ష్మీ గణపతి హోమం ప్రారంభం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విదుశేఖర భారతీ స్వామి ఆదేశంతో 25 రోజులపాటు నిర్వహించే శత సహస్ర(లక్ష) మోదక శ్రీ లక్ష్మీ గణపతి హోమం గురువారం శివరామ కృష్ణ క్షేత్రంలో ప్రారంభమమైంది. శృంగేరీ పీఠం పండితులు హోమం చేశారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, గందూరి చంద్రమౌళి, సంస్కృత పండితుడు డాక్టర్ ధూళిపాళ రామ కృష్ణ నిర్వహించారు.

కళా సంక్షేమమే సంస్కార భారతి లక్ష్యం



విజయవాడ కల్చరల్: కళా సంక్షేమమే సంస్కార భారతి లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ అన్నారు. ఆ సంస్థ నగర శాఖ ఆధ్వర్యంలో.. తుఫాను కారణంగా ఇబ్బంది పడుతున్న కళాకారులు, సాహిత్యరంగానికి చెందిన వారికి ఆర్థిక సాయం చేశారు. అయోధ్యనగర్‌లోని 'హైందవి'లో గురువారం కళాకారులకు ఆర్థిక సాయం అందజేసి సమావేశం నిర్వహించారు. డాక్టర్ పీవీఎన్ కృష్ణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సంస్కార భారతి సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజానికి సేవలను అందిస్తే భగవత్ సేవగా భావించవచ్చని చెప్పారు. యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్కార భారతి సహాయ కార్యదర్శి రాంకుమార్, సంస్థ ప్రతినిధులు సీతారత్నం, సాయి, భాస్కరశర్మ, కటారి విజయ్‌కుమార్, రాష్ట్రీయ స్వయం సేవక్ విభాగ కార్యదర్శి చక్రధారి పాల్గొన్నారు. సంస్కార భారతి ధ్యేయగీత ఆలాపన అనంతరం ఆర్థిక సాయం అందించారు.

కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



నెహ్రూనగర్: విజయవాడ నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలను పూర్వస్థితికి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ ఆదేశాల మేరకు విజయవాడలోని 62వ డివిజన్ పైపుల రోడ్డులో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రత్యేక పారిశుద్ధ్య పనుల్లో 100 మంది కార్మికులు, నలుగురు కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నామన్నారు. అతి త్వరలో తమకు కేటాయించిన ప్రాంతాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపి శానిటేషన్ వ్యవస్థను పరిశీలించారు.

వీడని వరద వెతలు

బుడమేరు వరద నగరాన్ని చుట్టుముట్టి ఐదు రోజులవుతోంది. అయినా ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో వరద వెతలు వీడటం లేదు. ప్రధాన రహదారుల్లో వరద నీరు లేకపోయినా అంతర్గత రోడ్లను నీళ్లు వీడలేదు. వ్యర్థాలు కలిసిపోవడంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉండటంతో బాధితులు ఇళ్ల ప్రహరీలు ఎక్కి ఆహారం, నీటి కోసం ఎదురుచూస్తున్నారు. నీటి ప్రవాహం తగ్గినచోట ప్రజలు ఇళ్ల నుంచి సామగ్రి తీసుకుని ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు వెడలిపోతున్నారు. నీళ్లు పోయిన చోట బురద మేట వేయడంతో నివాసితులు, దుకాణ యజమానులు శుభ్రం చేసుకుంటున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్స్, విజయవాడ



నీటిలోనే విజయవాడ నూజివీడు రహదారి.. ట్రాక్టర్లపై వెళ్తున్న ప్రజలు



రాజీవ్‌నగర్‌లో ఇంటిచుట్టూ నీరు రావడంతో తాగునీరు, ఆహారం కోసం ఇల్లు ఎక్కిన స్థానికులు



సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీదుగా ఆటోలో సామగ్రి తరలిస్తున్న ఓ కుటుంబం



మరపడవలకు, మత్స్యకారులకు విశ్రాంతి



సుందరయ్యనగర్లో వరదలో థర్మాకోల్ షీట్ పై పిల్లాన్ని తీసుకొస్తున్న దృశ్యం



సింగ్‌నగర్‌లో షెడ్‌లో శుభ్రం చేస్తున్న మెకానిక్‌లు



అంబాపురం ప్రాంతంలో నీట మునిగిన కారు



పైపులరోడ్డులో గృహోపకరణాలు తీసుకుని శుభ్రం చేసుకుంటున్న గృహిణి



శాంతినగర్‌లో వరదలోనే నీరు పట్టుకుంటున్న దృశ్యం



అంబాపురం వద్ద నీట మునిగిన గేదెలు



అల్పాహారం, పాలప్యాకెట్లు తీసుకెళ్తున్న ప్రజలు

ముంపు బాధితులకు బాసటగా..



వరద బాధితులకు సాయం అందజేస్తున్న న్యాయమూర్తి సత్యానంద్



కూరగాయలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి తదితరులు



ట్రాక్టర్ల ద్వారా ఆహారం పంపిణీ



భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి గ్రామానికి చెందిన బుడమేరు వరద బాధితులకు సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి ఎ.సత్యానంద్ సాయం అందజేశారు. గొల్లపూడి మౌలానగర్‌లోని షాదీఖానాలో, అలాగే అంబేడ్కర్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో 200 మంది బాధితులకు దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యానంద్ మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల్లో అనేక మంది పేదలు నష్టపోవడం దురదృష్టకరమన్నారు. ఇంట్లో సామగ్రినంతటినీ వదిలేసి కట్టుబట్టలతో బయటకు వచ్చేసిన వారందరూ నిరాశ్రయులుగా మారి తాగునీరు, ఆహారం దొరక్క ఇబ్బందులు పడటం బాధాకరమని చెప్పారు. ఇటువంటి సమయంలో వరద బాధితులకు సాయం అందించడం సామాజిక బాధ్యతగా భావించి తన వంతు సాయం అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో కమర్షియల్ కోర్ట్ జడ్జి పి.శ్రీధర్, ఏజీపీ చిన్నం రామకృష్ణ, స్థానికులు అంకిత కిట్టి, చిన్నం శ్రీదేవి, గాయత్రి, కమల తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు కూరగాయల పంపిణీ

విజయవాడ కల్చరల్: వరద ప్రభావిత ప్రాంతాలైన పాయకాపురం, సింగ్‌నగర్, ఉడాకాలనీ, రామకృష్ణాపురం, పైపుల రోడ్డు ప్రాంతాల్లో పురోహిత కుటుంబాలకు అంతిమ సంస్కార సహాయ సేవా సంఘం సభ్యుడు పులుపుల సాయి ఆధ్వర్యాన బీఆర్టీఎస్ రోడ్డులోని శారద కళాశాలలో కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి మాట్లాడుతూ ఆపద సమయంలో పురోహితులకు అండగా ఉన్న నిర్వాహకులను అభినందించారు. వంద కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు.

పీఆర్టీయూ, సేవాదళ్ సేవలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉపాధ్యాయ దినోత్సవ రోజున వరద బాధితులకు ఆహార పదార్థాలు, తాగునీరు పిల్లలకు పాలు, రొట్టెలు అందజేయడం డెమొక్రటిక్ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం సేవా నిరతి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అన్నారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఆహార పదార్థాలను ఇతర సామగ్రిని గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వాహనాల ద్వారా కబేళా, అంపాపురం, జక్కంపూడి కాలనీలో పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో సాయం అందజేశామని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీను తెలిపారు. సామాజిక బాధ్యతతో ఉపాధ్యాయ సేవాదళ్ సేవలను రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏ.శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటరెడ్డి, పి.కుమార్ రాజా, రాజేష్ నాయక్, పీత రమేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాలు, ఆహారం పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవసేవే మాధవసేవగా తలచి వరద బాధితులకు పలువురు నిత్యావసరాలు, ఆహార ప్యాకెట్లను అందజేస్తున్నారు. సింగ్‌నగర్, పాయకాపురం, సత్యనారాయణపురం పరిసరాల్లో పంపిణీ చేస్తున్నారు. సింగ్‌నగర్, అయోధ్యనగర్, బుడమేరు వంతెన పరిసర ప్రాంత ప్రజలను 'దహించు అగ్ని' వ్యవస్థాపకులు బిషప్ థామస్ పరామర్శించారు. సుమారు 500 మందికి నిత్యావసర వస్తువులు, ఒక్కొక్కరికి రూ. 4000 విలువైన బియ్యం పప్పు, పంచదార, టీ పొడి, ఉప్పు, కారం, ఆయిల్, దుప్పట్లు, ఇతర టాయిలెట్ సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దహించు అగ్ని మినిస్ట్రీ సిస్టర్ కరిష్మా ప్రైజీ, లయన్స్ క్లబ్ చైర్మన్ అయిన పెరికెలా క్రిస్టోఫర్, స్థానిక సంఘ కాపారులు పాస్టర్ జోసెఫ్ అలెక్స్, పాస్టర్ ఆనంద్ సునీల్, బ్రదర్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సహాయ చర్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. రామకృష్ణాపురం, దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, బుడమేరు మధ్యకట్ట, వినాయకనగర్ తదితర ముంపు ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, పాలప్యాకెట్లు పంపిణీ చేశారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం వరద ముంపు బాధితులకు ఆహారం అందజేశారు. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పాల్గొన్నారు. ముత్యాలంపాడులో వరద బాధితులకు కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఆర్‌కే ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన భోజనాలు పంపిణీ చేశారు. పెనుమత్స సత్యం, జొన్నలగడ్డ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బుడమరు వంతెన సెంటర్ తదితర ముంపు ప్రాంతాల్లో చుట్టుగుంట శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ గోకర్ణేశ్వరరావు వరద బాధితులకు ఆహార పొట్లాలు, పాలు, తాగునీరు పంపిణీ చేశారు. కృష్ణా హాస్పిటల్స్, డాక్టర్ కాగిత లక్ష్మీ నరేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకుఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, అనురాగ్, లక్ష్మీ ఐశ్వర్య, ఎరకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, పాయకాపురం, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, పాలఫ్యాక్టరీ, సితార, భవానీపురం ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన బాధితులకు స్వచ్ఛంద సేవా సంస్థలు, వైఎస్సార్ సీపీ నాయకులు బాసటగా నిలుస్తున్నారు. సీఎంఆర్ గ్రూప్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, భోజనాలు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. సీఎంఆర్ మేనేజర్ విజయ్ ఆనంద్, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో న్యూరాజరాజేశ్వరిపేటలోని బాధితులకు భోజనాలు, వాటర్ బాటిళ్లు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నేతలు ఇసరపు రాజు, కాళ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.



ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం



మంచినీటి బాటిళ్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష

మధురంగా వయోలిన్ కచేరి

విజయవాడ కల్చరల్: స్వరఝురి సంగీత సేవా సంస్థ నెల వారీ సంగీత కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద గురువారం వయోలిన్ విద్వాంసుడు పెరవలి నంద కుమార్ నిర్వహిచిన వయోలిన్ కచేరి మధురంగా సాగింది. శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ వాగ్గేయకారులు రచించిన కీర్తనలను వయోలిన్‌పై మధురంగా పలికించారు. పెరవలి జయతి సహ వయోలిన్ సహకారం, సద్గురు చరణ్ మృదంగం, ఎం. హరిబాబు ఘటంపై సహకరించారు. మంచాల జగన్నాథరావు సంకలన పరచిన కృతి రత్నావళిని అతిథులు ఆవిష్కరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సంగీత అభిమానులు అధ్యయనం చేయవల్సిన గ్రంథంగా అభివర్ణించారు. కార్యక్రమంలో మంచాల జగన్నాథరావు, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.



వయోలిన్ కచేరి నిర్వహిస్తున్న పెరవలి నందకుమార్

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన ఘాట్‌రోడ్డులో విరిగి పడిన కొండ చరియల వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈవో కె.ఎస్.రామరావు చెప్పారు. దుర్గాఘాట్ ఎదుట నిర్మాణంలో ఉన్న రిటైనింగ్ వాల్, ఘాట్‌రోడ్డులో విరిగిపడిన గోడ ప్రాంతాలను గురువారం సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ పాండురంగారావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండ రాళ్లు విరిగిపడిన ప్రాంతంలో ఇబ్బంది కలగకుండా వాల్ నిర్మాణానికి అవసరమైన ప్లాన్‌ను తక్కువ సమయంలో దేవస్థానానికి అందజేస్తామని పాండురంగారావు పేర్కొన్నారు. పనుల నాణ్యత, భక్తులకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావును ఈవో రామరావు ఆదేశించారు.

పేరుకుపోతున్న చెత్త



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకపక్క బుడమేరు వరదతో అల్లాడుతున్న ప్రజలు అధ్వానంగా మారిన పరిసరాలతో ఎప్పుడు ఏ వ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ముత్యాలంపాడు పశుసంవర్ధక శాఖ కార్యాలయం సమీపంలో, వీవీ నరసరాజు రోడ్డు శ్మశానం, మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోను చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉచిత వైద్య శిబిరం

మైలవరం: విష జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ అన్నారు. స్థానిక వీవీఆర్ జూనియర్ కళాశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

